# లక్కంటే నాదే!

"ముష్టి పత్రికలకు వీర ముష్టి కథలెందుకు రాసి పంపుతారో నలభైయ్యేళ్ళుగా నాకు అర్థమై చావటం లేదు. రాసిన కథనే పాతికసార్లు ఫెయిర్ చేస్తారు. చెయ్యి గుంజుకు పోతోందనేసి ఏడుపొకటి! ఎంచక్కా డి.టి.పి అయినా చేయించి ఏడవరు. కవర్లు... పోస్టేజి... తెల్లకాగితాల ఖర్చు... కొరియర్ ఛార్జీలకు బోలెడంత కేస్ట్రాయిలు... "మాటలతో కుళ్ళపొడిచింది భార్యామణి వెయ్యోసారి-సుమారుగా.

శ్రీమతి నన్నీవిధంగా ఆడిపోసుకోవటం పరిపాటైంది. మొగుడ్ని అనే మాట అటుంచితే... కనీసం రైటర్నన్నే గౌరవం కించిత్ అయినా చూపదు సరికదా... ఆవిడ గారికి నా మీద ఆగ్రహం వచ్చినప్పుడల్లా... నన్ను, నా రచనా వ్యాసంగాన్నీ వుతికి ఆరేస్తుంటుంది.

దాని పిచ్చివాగుడు నాకేం కొత్తకాదు. రోటీనైంది. కథలన్నా... కథలు రాసే రైటర్సన్నా మా ఆవిడకు అరికాలి మంట నెత్తికెక్కుతుంది. కారం పూసుకున్నట్లు వళ్లు మండుతుంది. చచ్చేటంత కోపం ముంచుకొస్తుంది. అప్పుడప్పుడు అపరకాళికలా... చండిలా... ఉగ్రరూపం దాల్చి వీరంగం చేస్తుంది. ఆరోజు ఇంట్లో పొయ్యి వెలగదు. ఇద్దరం పస్తే. ఓ పూట కడుపు కాలటం ఆరోగ్యానికి టానిక్ లాంటిదనేసి సరి పెట్టుకుంటాను. "కొంపంతా కథల కంపు కొడుతోంది. పాడుబడ్డ ఇంట్లో గబ్బిలాల వాసన లాగా, ఇంట్లో ఏ మూల చూద్దామన్నా కథల కట్టలేనాయె?!"... ఉదయాన్నే కాఫీ అందిస్తూ సుప్రభాతం మొదలు పెడుతుంది. 'రైటర్ గాడింట్లో కథల కంపు కాకపోతే సెంటుకంపు కొడుతుందా?" సీరయస్‌గా అన్నాను. "జోకా? వెటకారాలే వద్దు. వళ్లు మండుద్ది! రైటరంటేనే నాకు ఎలర్జీ! తమరు రచయితని తెలీక పొరపాటున మీచేత తాళి కట్టించుకునేడ్చాను. లేకుంటే ఏ ముష్టోడికో పెళ్ళానైనా అయివుండేదాన్ని... మీతో పెళ్లి సంబంధం ఖాయం కాకముందు, మాడాడీ అరడజను సంబంధాలు తీసుకొచ్చాడు. వాళ్లంతా ప్రొఫెషనల్ రైటర్స్‌ని పెళ్లి చూపులప్పుడే వాసన పట్టి 'ఛీ' కొట్టాను. మీరు నిజాన్ని దాచి నా మెడవంచారు. మోసపోయి మీ బుట్టలో పడ్డాను. తర్వాత గానీ తెల్సిరాలేదు. నూనె

గుడ్డల వాడికంపులాగ మీవద్ద కథల కంపు వుందని. అప్పటికీ మూడు ముళ్లు పడటంతో నోరు మెదపలేకపోయాను...'' రుసరుసలాడింది.

"నన్ను పెళ్లాడి పప్పులో కాలేశానంటావ్. దానికి ఇంత రాద్ధాంతం, ఏడుపు దేనికట...?''

"ఏదో ఎర్రగా బుర్రగా వున్నారు. పర్సనాలిటీ బాగుండేడ్చిందికదాని తలూపాను. తలంబ్రాలు పోయించుకున్నాను. సంబరపడిపోయి పళ్లికిలించి మురిసేడ్చాను. కాపురానికొచ్చాక మీ నిజస్వరూపం, అదే కథకులనే అసలు రంగు బైటపడింది. కాపురాన్ని కాలదన్నుకోలేక వీధిన పడటం ఇష్టంలేక, నలుగురిలో చులకనైపోతానేమోననే భయంతో జంకి మీతో ఇన్నేళ్లుగా కాపురం వెలగబెడుతున్నాను. అండ్రస్టాండ్'' కళ్లల్లో సుళ్లు తిరిగే నీరు పైట కొంగుతో అద్దుకుని చిర్రున చీదింది.

ఇదేం పెళ్లామోగానీ... ఇంటికో మాసపత్రికనో, వార పత్రికనో తేనివ్వదు. నామీద కోపం వాటిమీద చూపి చింపి పోగులు పెడుతుంది. అందుకే పత్రికలను భద్రంగా బీరువాలో దాచి తాళం వేస్తాను. అయినా సరే పోలీస్ డాగ్‌లా వాసన పట్టి ఎందుకు తెచ్చిదాచారంటూ నా మీద వార్ డిక్లేర్ చేస్తుంది.

ఆ క్షణంలో నా గుండె అగ్నిపర్వతమే అవుతుంది. కళ్లు చింత నిప్పులవుతాయి. బి.పి. తారాస్థాయికి చేరుతుంది. పళ్లు నూరతాను. కోపంతో ఊగిపోతాను. ఇన్ని చేసినా శ్రీమతిపై చేయెత్తలేను. ఎందుకంటే? అది పరమ గయ్యాళి. ఉగ్రరూపందాల్చిన అపర మహంకాళి అవుతుందేమోననే భయం. చేతుల్లో వేపమండలు, మెళ్లో నిమ్మకాయల దండ, చాచే ఎర్రనాలుక లాంటివేవీ లేకపోయినా పూనకం వచ్చిన దానిలా ప్రవర్తిస్తే నా గుండె ఆగినట్టన్పిస్తుంది. వారంపాటు మంచంలో రోగిష్టివాడిలా వుండవలసి వస్తుందేమోనని భయం నన్ను పీక్కుతింటుంది. నేను ఆ క్షణంలో పిల్లికూననే!

నాకాపంలో ఫిమేల్ డామినేషన్ రాజ్యమేలుతోందని తెలిసినా గుడ్లు మిటకరించటం, నోరు చప్పరించటం మినహా మరెమీ చేయలేని నిస్సహాయుడిని!

ఈ గయ్యాళిగంప కాపురానికొచ్చిన లగాయితు నాతో కబడ్డీ ఆడని రోజంటూ లేదు. నోరు విప్పిందంటే నానోటికి పెరాలసిస్ వచ్చినట్టు ఫీలవుతాను.

"ఉపవాసం వుంచకే. లంఖణాలు చెయ్యలేక ఛస్తున్నాను'' ఓరోజు

ఏడుపులంకించుకున్నాను.

"మరేం ఫర్వాలేదు. కొలెస్ట్రాలు తగ్గితే ఆరోగ్యానికి మంచిది. హార్ట్ ఎటాక్ రాకుండా ఉంటుంది, బరువు తగ్గారంటే బి.పి.రాదు...." కోతిలా కిచకిచా నవ్వేసింది.

దీనిదుంప తెగిపోను. క్రితం జన్మలో ఇది లేడీ డాక్టరైయ్యుండాలి.... ఈ జన్మలో బ్రహ్మరాక్షసై నాప్రాణాలు తోడేస్తోంది. కథలు రాసుకునేందుకు మూడ్ లేకుండా నానా అవస్థలు పెట్టోస్తోంది.... పెదాలు కదలకుండా అనుకున్నాను అది తిట్టోదీవెనో అర్థం కానీకుండా.

ఏం చేస్తాను? నెత్తిన జీలకర్ర బెల్లం పెట్టి, అగ్ని చుట్టూ దాని చిటికెన వేలు పట్టుకొని తిరిగిన వాడిని... 'నాతి చరామి' అని అఘోరించినవాడిని కావటానదాన్నేమీ అన్లేని దుస్థితి నాది!

నేనేమో సన్నగా, నాజూగ్గా, అగ్గి పుల్లలగానో... దర్భ పుల్లలాగానో వుంటాను. లిమిట్‌గా తింటాను. వేపుళ్లు, చిరుతిళ్లు జోలికిపోను. ఇలా వున్న నాకు కొలెస్ట్రాల్ వస్తుందేమోనని శాపనార్థాలు పెట్టి తాషామరపా వాయించటం నాకు బోత్తిగా నచ్చని విషయం.

అదేమో రుబ్బురోలులా, రబ్బరుబంతిలా, తారుడబ్బాలా, నూరు కేజీల బియ్యం బస్తాలా వుంటుంది. ఇద్దరం ఆటోలో పట్టం! సినీమాకెళ్లాల్సివస్తే ఆటోలో ఇద్దరం కూర్చుని పోవాలంటే చావుకొస్తుంది. ఎంచక్కా అది ఆటోలో, నేనేమో టాప్‌మీద కూర్చుంటే ఎంత బావుండు అన్పిస్తూంటుంది. ఇదండీ మా అన్యోన్యత! తద్దినంనాడైతే... రెండు డజన్ల గారెలు, అల్లంపచ్చడితో అవలీలగా చప్పరించేస్తుంది. నా విస్తరిలో ఒకటో రెండో వడ్డించి ఇక చాలన్నట్టు గుడ్లురుముతుంది. బిక్క చచ్చిపోయి అక్కడితో తృప్తి పడక తప్పదు.

తిండి పుష్ఠిగల ఆడది కాబట్టే నా శ్రీమతి అరడజను మంది పిల్లలను కన్నది. అందునా నార్మల్ డెలీవరి. సిజేరియన్ అనే ప్రశ్నే లేదు కాబట్టి బతికిపోయాను. లేకుంటే హాస్పిటల్ ఖర్చు తడిసి మోపెడయ్యేది. అప్పు చేయాల్సి వచ్చేది. తన జీతంలో పైసా ఖర్చుపెట్టదు.

ఆఫ్టాల్ నేను డిగ్రీ హోల్డర్ని. ఆఫీసర్ వుద్యోగం వస్తుందనేసి నేనేనాడూ కలలు కన్లేదు. నా చదువుకు తగ్గట్టు ఓ క్లర్క్ ఉద్యోగం సంపాదించటమే గగనమైంది.

సంపాదన ఇంటి ఖర్చుకే బొటాబొటిగా సరిపోతూ వచ్చేది.

పెళ్లై నాలుగేళ్లయినా తిరక్కుండానే అత్తమామలు టపా కట్టారు. పెళ్లాం కాన్పు ఖర్చు నానెత్తినబడింది.

నా పెళ్లాం పి.జీ చేసింది కాబట్టి దానికేమో ప్రైవేట్ కంపెనీలో నెలకు యాభై వేలు జీతం, కారు, హోదా అన్నింటిలో నా కంటే ఎక్కువే.

కారు కంపెనీదే అయినా ఓనర్‌లా వ్యవహరించటం నాకు నచ్చేదికాదు. నన్ను చచ్చినా కార్లో కాలుపెట్టనిచ్చేది కాదు. దాని అతిశయం చూస్తే నాకు వళ్లు మంట.

అయినా అదంటే నాకు పంచ ప్రాణాలు. అది నన్నెంత తిట్టినా, కించపరుస్తూ మాట్లాడినా, నేను మాత్రం పెళ్లాన్ని పల్లెత్తు మాట అనను. నా కథల ప్రపంచంలో బిజీగా వుండే మనిషిన్నేను.

దాని జీతంలో పైసా అయినా సరే ఇంటి ఖర్చుకు వాడదు. తన కోసం దాచుకుంటుంది. అయినా సరే అదేమిటని ఏనాడూ ప్రశ్నించలేదు.

"ఏమిటీ నిద్రాహారాలు మాని ఓ... తెగ రాసేస్తున్నారు. కాస్త జోరు తగ్గించండి. లేకుంటే ఆరోగ్యం చెడుతుంది..." వార్నింగిచ్చినట్టు మాట్లాడింది గజలక్ష్మి నా శ్రీమతి.

"నన్నొదిలెయ్. నవలలపోటీకి వెయ్యి పేజీల నవల రాయటానికి ఒక వైపు కుస్తీ పడుతుంటే మధ్యలో నీ గొడవేంటి?"

"ఓ యబ్బ! బోడి నవల రాయటానికి ఎందుకింత ఇదవుతారు. మా రచయిత్రులు చూడండి ఎన్నెన్ని నవలలు రాసిపారేస్తున్నారో? అవునూ.... పోటీ అంటున్నారు ప్రైజ్ మనీ ఎంతేమిటీ?" కూపీలాగ ప్రయత్నించింది.

"చెప్తే మూర్ఛపోతావ్..."

"నా నెలజీతం కంటేనా?" వెటకారంగా అంది గజలక్ష్మి.

"ఓ చిన్నసైజు కారు ఖరీదంత....."

"అంటే ఒకటి రెండు లక్షలా?" నోరు బార్లా తెరిచి అంది.

"టెన్ లాక్స్! పది లక్షలే ఫస్ట్ ప్రైజు!"

"అమ్మో ఫర్వాలేదే... ఓ ఆడపిల్ల పెళ్లి చెయ్యొచ్చు. అయినా ఫస్ట్ ప్రైజ్

మీకే వస్తుందని ఏమిటి నమ్మకం? పోటీ బరిలో మీరూ వుంటారు... దట్సాల్"
ఫక్కున నవ్వింది.

"అలా నవ్వకే. చాలా కాన్ఫిడెంట్‌గా ఒక కొత్త సబ్జక్ట్ రాస్తున్నాను"

"కలలు కంటూ వుండండి. ఇప్పటికే మీరెన్నెన్ని కథలు, నవలలు రాయలేదు గనుక? ఏనాడైనా మీ రచనకు బహుమతంటూ వచ్చేడ్చిందా? ఆడపాతడపా కొన్ని కథలు మాత్రం అచ్చుకునోచుకున్నాయి. ఒకటో రెండో సీరియల్స్ రావటం గగనమైంది. మీ రచనలు పుస్తకాలుగా అచ్చేసినా పబ్లిషరేమో ఓ వెయ్యి ఎడ్వాన్సిచ్చి మీ నెత్తిన చెంగేశాడు. అదీ మీ ఘనత - నేనెరగనిదా? అయినా సిగ్గు లేకుండా యాభైయ్యేళ్ళుగా చెయ్యి చచ్చుపడేట్టు రాస్తూనే వున్నారు. మీ శ్రమకు హేట్సాఫ్..."

'హమ్మయ్య... ఇన్నేళ్ల వైవాహిక జీవితంలో నేటి నా భార్యామణి కొంతలో కొంత నన్ను మెచ్చుకుంటూ మాట్లాడింది' అనుకుని మనసులో మురిశాను.

"ఎగతాళి చేయకే గజలక్ష్మీ. నా జాతకం ప్రకారం ప్రస్తుతం శుక్ర మహాదశ నడుస్తోందిప్పుడు. పట్టిందల్లా బంగారమే. పదిలక్షల ఫస్ట్ ప్రైజ్ నాకే తప్పదు..."

"మీ వెర్రి మీదే. కానివ్వండి. వద్దంటే ఏనాడు మీరు రచనా వ్యాసంగానికి ఫుల్‌స్టాప్ పెట్టారు గనక?" అనేసి బెడ్‌రూమ్‌లోకెళ్లి నిద్రకుపక్రమించింది శ్రీమతి.

నాకింకా ఏడాదే సర్వీసుంది. ఆ తర్వాత రిటైర్మెంట్. అంటే నెలనెలా వచ్చే జీతానికి మంగళం. పెన్షన్‌లేని జాబ్. రోజులు గడవటం ఇబ్బందే.

నా కథల ఖర్చుకు నెలకో వెయ్యి రూపాయలైనా ఇమ్మని గజలక్ష్మి ముందు నిలబడి చెయ్యి చాచాలి కాబోలు. నో! మనస్సాక్షిని చంపుకుని శ్రీమతిని డబ్బు కావాలని యాచించలేను. కథలు రాయకుండా వుండలేను. ఈ సమస్యకు పరిష్కారం ఎట్లాగో తోచలేదు. నా నవలకు ఫస్ట్ ప్రైజొస్తే బాగుండు. హాయిగా ఎంచక్కా చేతిలో డబ్బాడుతుంది. ఆ రాక్షసిని అడగాల్సిన అవసరం వుండదు.

"ఇదిగో, నువ్వు రిటైరైతే నీకు పది పైసలు కూడా ఇవ్వను. కట్టుకున్న నేరానికి ఇంత తిండి పడేస్తాను. కథలు, కాకరకాయలు అనకుండా కుక్కిన పేనలా ఇంట్లో పడుండు..." అంటూ ఓ రోజున శ్రీమతి చేసిన హెచ్చరిక గుర్తుకొచ్చింది. హెచ్చరిక కాదది అల్టిమేటమ్. అది అన్నంత పనీ చేస్తుంది.

"భార్యాభర్తల మధ్య గొడవలున్నా, నాడబ్బు నీది కాదా? నీ సంపాదన

నాది కాకపోతుందా? డబ్బుకు స్వపర బేధాలుండవే.." ఏడవలేక నవ్వుతూ ఇచ్చిన జవాబు గుర్తుకొచ్చింది.

"ఆ పప్పులేం వుడకవ్" అనటంతో బిక్క చచ్చిపోయాను.

"ఇదిగో చూడు రైటరూ!... ఎక్కడైనా పెళ్లాంగానీ... డబ్బు విషయంలో మాత్రం కాదు. స్టేషనరీ, పోస్టల్ స్టాంపులు కావాలనుకుంటే ముందుగా కొని స్టాక్ వుంచుకో. ఆ తర్వాత నామీద పడి ఏడ్చి ప్రయోజనం వుండదు" అనేసి శ్రీమతి కటువుగా, కర్కశంగా అన్న మాటలు నా గుండెలో గునపాల్లా గుచ్చుకుని బాధించాయి.

× × × × ×

నేను మేరుపర్వతంలాంటి పదిలక్షల రూపాయల బహుమతికి ఆశపడినా, నాకు దక్కింది మంగళగిరి కొండంత మూడో బహుమతి రెండు లక్షలు!

ఈవార్త గజలక్ష్మికి శుభవార్త కావటం అటుంచి, నాపాలిట దుర్వార్త అయిపోయింది.

"ఫరవాలేదు. రిటైరయ్యాక ఖర్చులకి సంపాదించుకున్నారు. ఇలాగే గడిపెయ్యండి శేష జీవితం" అన్న శ్రీమతి వెటకారం ఆరెండు లక్షల ఆనందాన్ని రెండు నిమిషాలు కూడా మిగల్చలేదు.

× × × × ×

ఆ పత్రికలో బహుమతి కథలు అచ్చయిన ఆరో రోజు అనుకుంటూ-

రాత్రి నేనింటికి వచ్చేసరికి ఇల్లంతా నాకు ఘన స్వాగతం పలుకుతోంది. వీధిలో ఇరుగుపొరుగు మహిళా శక్తుల్ని ప్రోగుచేసి, ఆ బృందానికి సారధిగా గజలక్ష్మి నాకు ఎదురొచ్చారు. నాకు దిష్టి తీశ్యారు. హారతిచ్చారు.

స్పెషల్ కుర్చీలో కుషన్ దిండ్లు వేసి, కూర్చోపెట్టి పన్నీరు జల్లారు. నోట్లో స్వీట్లు కుక్కారు. నా పాదాలు కడిగి నీళ్ళు నెత్తిన జల్లుకుంటూ "మీరు నా భర్త కావటం నా పూర్వజన్మ సుకృతం" అంటూ బహిరంగంగా గజలక్ష్మి ప్రకటించేసింది.

అంతే, సంవత్సరాల తరబడి కథలు రాసినా రాని పక్షవాతం ఆ క్షణమే నా నోటికీ, చేతికీ వచ్చేసినట్లయింది. అలాగే అచేతనంగా వుండిపోయాను.

అందర్నీ సాగనంపటానికి గజలక్ష్మి బయటకెళ్ళాక- యాంత్రికంగా

పడగ్గదిలోకి అడుగుపెట్టిన నాకు అక్కడ గోడకి కొత్తగా వేలడుతున్న పెద్ద ఫ్రేము అందులో ఆరోజే పోస్టులో వచ్చినట్లున్న లెటర్ కన్పించింది.

యథాలాపంగా చదివాను.

"నందా గారు, నేను కథలు బాగా చదువుతాను. ఇప్పుడే మీ కథ చదివాను. మొదటి బహుమతి రావలసిన కథ అది. మానవ సంబంధాల లోతుపాతుల్ని ఇంత మనసుకి హత్తుకునేలా రాయగల రచయితని నేనింతవరకూ చూడలేదు. అవటానికి నేను ఈ జిల్లాకి కలెక్టర్ని. కాని నా స్థాయిని మించిపోయి, ఈ కథ చదివే కొన్ని లక్షల పాఠకుల హృదయాలకి మీరు చక్రవర్తి అయిపోయారు. మీ భార్యకి, పిల్లలకి మీరెంతో గర్వకారణం...!"

నా బుర్రలో బల్బు వెలిగింది. అమెరికావాడు గొంతెత్తి అరిస్తే గాని మన పెరట్లో వేపచెట్టు ఔషధ విలువలు తెలుసుకోలేకపోయాం కదా!

(ఏప్రిల్ 2012 'ఆంధ్రప్రదేశ్' మాస పత్రిక)